క్లుప్తంగా

భగవద్గీత పఠనంతో ఉత్తమ జీవన యానం

కర్నూలు కల్చరల్: భగవద్గీత పఠనంతో ఉత్తమ జీవన విధానం అలవడుతుందని కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ చైతన్య ప్రభు అన్నారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో శీల ప్రభుపాదుల ప్రేమ విందు, భగవద్గీత శిక్షణ తరగతులు జరిగాయి. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో ఉత్పన్నమయ్యే సమస్యలకు భగవద్గీతలో పరిష్కారం దొరుకుతుందన్నారు. అనంతరం హరే రామ హరే కృష్ణ సంకీర్తన జప యజ్ఞం నిర్వహించారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సులేఖ రాణికి డాక్టరేట్



కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఇంగ్లిషు విభాగంలో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్న ఎస్.సులేఖ రాణికి డాక్టరేట్ లభించింది. యోగి వేమన విశ్వవిద్యాలయంలో ఇంగ్లిషు ప్రొఫెసర్ డాక్టర్ పి.పద్మ పర్యవేక్షణలో 'అప్రెషన్ అండ్ విక్టిమైజేషన్ ఆఫ్ విమెన్ ఇన్ ది సెలెక్ట్ ప్లేస్ ఆఫ్ విజయ్ టెండూల్కర్ ఏ స్టడీ' అనే అంశంపై చేసిన పరిశోధనకు ఆర్‌యూ డాక్టరేట్ ప్రకటించింది. ఈ విషయాన్ని అవార్డు గ్రహీత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

హామీలు అమలు చేయాలి



సామూహిక నిరసన కరపత్రాలు విడుదల చేస్తున్న ఫ్యాప్టో నాయకులు

కర్నూలు సిటీ: ఎన్నికల సమయంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఫ్యాప్టో నాయకులు డిమాండ్ చేశారు. ఈ నెల 12వ తేదీన ఉపాధ్యాయ సమస్యలపై 12 గంటల పాటు సామూహిక నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆదివారం సలాం ఖాన్ భవన్‌లో ఏర్పాటు చేసిన ఫ్యాప్టో జిల్లా కమిటీ సమావేశంలో విడుదల చేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో రాష్ట్ర కో–చైర్మెన్ ప్రకాష్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.హృదయ రాజు, జిల్లా కమిటీ చైర్మెన్ ఎస్.గోకారి, సెక్రటరీ జనరల్ గట్టు తిమ్మప్ప పాల్గొని ప్రసంగించారు. ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. సమావేశంలో ఫ్యాప్టో నాయకులు జనార్ధన్, శేఖర్, నాగరాజు, గోవింద్,నాయక్, దేవదాస్, మారియానందం, సుధాకర్, జయరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలి

కర్నూలు సిటీ: రాష్ట్ర ప్రభుత్వం జూన్, జూలై నెలల్లో నిర్వహించిన బదిలీలు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్)జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప డిమాండ్ చేశారు. ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయనతో పాటు నంద్యాల జిల్లా విభాగం ఉపాధ్యక్షుడు రోషన్న, ఉపాధ్యాయ క్రాంతి పత్రిక ప్రధాన సంపాదకులు రత్నం ఏసేపు, ఆ సంఘం రాష్ట్ర కౌన్సిలర్ తాజుద్దీన్ పాల్గొని ప్రసంగించారు. వేతనాలు ఆలస్యం కావడంతో ఈఎంఐలు, పిల్లల ఫీజుల చెల్లింపునకు టీచర్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు మద్దయ్య, ముద్దు రంగప్ప, హుసేని, రాఘవేంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని

కర్నూలు (టౌన్): కొట్లాడి భార్య పుట్టింటికి వెళ్లడంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదివారం నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. క్రిష్ణనగర్‌లో శ్రీకాంత్(35) కుటుంబం నివసిస్తుంది. ఈయనకు భార్య ఒక కొడుకు, ఒక కుమారుడు ఉన్నారు. ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్న శ్రీకాంత్ , అతని భార్య ఆదివారం ఉదయం గొడవ పడ్డారు. ఈ క్రమంలో ఆమె అమె పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లింది. తీవ్ర మనస్థాపానికి గురైన శ్రీకాంత్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పక్కింటి వాళ్లు గుర్తించి బంధువులకు సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిన అక్కడికి చేరుకుని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

చిన్మయ మిషన్‌లో బాల విహార్ తరగతులు

కర్నూలు కల్చరల్: స్థానిక వీఆర్ కాలనీలోని చిన్మయ ప్రభావళి భవన్‌లో ఆదివారం చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో బాల విహార్ తరగతులు జరిగాయి. మిషన్ జిల్లా బాధ్యులు స్వామిని సుప్రేమానంద విద్యార్థులకు భగవద్గీత గురించి తెలియజేశారు. నైతిక విలువలు కలిగి క్రమశిక్షణతో మెలగాలన్నారు. పిల్లలకు ఇష్టమైన రంగాల్లో రాణించేలా తల్లిదండ్రులు సహకరించాలన్నారు. భగవద్గీత పఠనం, శ్రవణం చేయాలన్నారు. అలాగే భగవద్గీత శ్లోకాలు నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మిషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థకే మచ్చ



చంద్రబాబు వ్యాఖ్యలపై పాతబస్టాండ్‌లో నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మేయర్ బీవై రామయ్య



బాబు దిష్టిబొమ్మను చెప్పులతో కొడుతున్న వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

- పుంగనూరు ఘటనపై వైఎస్సార్‌సీపీ ఆగ్రహం
- అంబేడ్కర్ విగ్రహం వద్ద చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం
- భారీగా హాజరైన పార్టీ శ్రేణులు

కర్నూలు(అర్బన్): నాలభైయేళ్ల రాజకీయ అనుభవమని చెప్పుకునే చంద్రబాబు ప్రజాస్వామ్య వ్యవస్థకే మాయని మచ్చలా తయారయ్యారని వైఎస్సార్‌సీపీ నేతలు మండిపడ్డారు. సాగునీటి ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా పుంగనూరులో జరిగిన విధ్వంసకాండకు ఆయన పూర్తి స్థాయిలో బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. బాబు సృష్టించిన విధ్వంసానికి నిరసనగా ఆదివారం నగరంలోని పాతబస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, నగర మేయర్ బీవై రామయ్య ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై చంద్రబాబు దిష్టిబొమ్మను చెప్పులతో కొడుతు దహనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం. సుభాష్ చంద్రబోస్, మాజీ ఎంపీ బుట్టా రేణుక, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ మద్దయ్య, బీసీ విభాగం కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి, నగర అధ్యక్షురాలు, కార్పొరేటర్ సిట్రా సత్యనారాయణమ్మ, మాజీ మేయర్ బంగి అనంతయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ ... ప్రాంతీయ విభేదాలు సృష్టించేందుకు చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. కర్నూలుకు హైకోర్టు బెంచ్ ఇస్తామన్న హామీని ఆయన అమలు చేయలేదన్నారు. సీమకు తీవ్ర అన్యాయం చేయడమే కాక ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు టీడీపీ అధినేత చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు తిప్పికొడతారన్నారు. రాజకీయ లబ్ధి కోసం చంద్రబాబు ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. కేవలం కియా పరిశ్రమ చూపించి రాయలసీమ అభివృద్ధి తన వల్లే జరిగిందనే భ్రమలో ఉన్నారన్నారు. నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో అసాంఘిక కార్యక్రమాలను పెంచి పోషిస్తున్న చంద్రబాబును రాష్ట్రం నుంచి బహిష్కరించాలన్నారు. పుంగనూరులో జరిగిన విధ్వంసకాండ, చంద్రబాబు వ్యాఖ్యలపై కోర్టు సుమోటోగా కేసు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రాజేశ్వరరెడ్డి, నగురూరు శ్రీనివాసరావు, ఫరాక్‌ఖాన్, యూనుస్‌బాషా, కోఆప్షన్ మెంబర్ శ్రీరాములు, నాయకులు కేదార్‌నాథ్, బత్తుల లక్ష్మీకాంతయ్య, నవీన్, ఆదిమోహన్‌రెడ్డి, శర్మ, రైల్వే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు రాజకీయ సమాధి కడతాం



చెన్నమ్మ సర్కిల్‌లో చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న పాణ్యం నియోజకవర్గ వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

కల్లూరు: రాబోయ్యే ఎన్నికల్లో చంద్రబాబుకు రాజకీయ సమాధి కడతామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కల్లూరు అర్బన్ జేసీఎస్ కన్వీనర్ హనుమంతురెడ్డి, కార్పొరేటర్ శ్వేతారెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి అన్నారు. పుంగనూరులో చంద్రబాబు సృష్టించిన విధ్వంసకాండపై ఆదివారం చెన్నమ్మ సర్కిల్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. చంద్రబాబు దిష్టి బొమ్మను దహనం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రబాబు వద్దు.. ప్రజాస్వామ్యం ముద్దు, చంద్రబాబు వైఖరి నశించాలి అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుంతురెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకులు వారాహి, యువగళం, సాగునీటి ప్రాజెక్టుల సందర్శన పేరుతో రాష్ట్రంలో అలజడులు సృష్టిస్తున్నారన్నారు. కర్నూలు, నంద్యాలలో ప్రాజెక్టుల సందర్శన పేరుతో నిర్వహించిన సమావేశాలకు ప్రజలు రాకపోవడంతో పులివెందులలో విధ్వంసకాండకు ట్రైలర్ వేసి, పుంగనూరులో సినిమా ప్రదర్శించారని చెప్పారు. విధుల్లో ఉన్న పోలీసులపై టీడీపీ నాయకులు దాడిచేయడం దారుణమన్నారు. అధికార దహంతో రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్న చంద్రబాబును రాష్ట్రంలోని ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. కార్పొరేటర్ శ్వేతారెడ్డి మాట్లాడుతూ పుంగనూరులో విధ్వంసకాండకు కారణమైన చంద్రబాబు వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కల్లూరు అర్బన్ పరిధిలోని కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్

తైక్వాండోలో రాణించాలి



క్రీడాకారులకు వాటర్ బాటిళ్లు అందజేస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

కర్నూలు(రూరల్): విద్యార్థులు తైక్వాండో క్రీడలో రాణించాలని ప్రముఖ వైద్యుడు శంకర్ శర్మ తెలిపారు. ఆదివారం నగరంలోని పెద్ద మార్కెట్ మున్సిపల్ పార్క్ మైదానంలో తైక్వాండో పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు వాటర్ బాటిళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో శిక్షకుడు వెంకటేశ్వర్లు, రోహిత్, నాగరాజు, ఊర్మిళ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ రోజు

సత్యసాయి సేవాట్రస్ట్ సభ్యుల సమావేశం

కర్నూలు కల్చరల్: కర్నూలు నెహ్రూనగర్‌లోని సత్యసాయి మందిరంలో సోమవారం సాయంత్రం 5 గంటలకు సత్యసాయి సేవా ట్రస్ట్ యాక్టివ్ సభ్యుల సమావేశం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు ఎం. అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బాలవికాస్ గురువుల శిక్షణ శిబిరం, శతాబ్ది ఉత్సవాలు, లిఖిత నామ జపం, సత్యసాయి ప్రేమ తరు (ప్లాంటేషన్), ప్రశాంతి సేవల గురించి సమావేశంలో చర్చించినున్నట్లు వెల్లడించారు.

కలెక్టరేట్ ఎదుట మహా ధర్నా

కర్నూలు(సెంట్రల్) : జిల్లా సమగ్రాభివృద్ధి కోసం సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కేంద్ర కమిటీ సభ్యులు బీవీ రాఘవులు, ఎంఏ గఫూర్ హాజరవుతారని చెప్పారు.





మహాగౌరి అమ్మవారికి హారతి ఇస్తున్న పురోహితులు , శ్రీలలితా సహస్రనామ పారాయణ పూర్వక కోటి కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

భక్తి శ్రద్ధలతో సంకటహర చతుర్థి వ్రతాలు

కర్నూలు కల్చరల్: సంకట హరి చతుర్థిని పురస్కరించుకుని స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం వరసిద్ధి వినాయక స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు, సంకట హర చతుర్థి వ్రతాలు విశేషంగా జరిగాయి. అధిక శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని శ్రీ మహా గౌరీ పరదేవతా సన్నిధిలో శ్రీలలితా సహస్రనామ పారాయణ పూర్వక కోటి కుంకుమార్చన మహాయజ్ఞ పూజలు జరిగాయి. సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

17వ వార్డు కార్పొరేటర్‌కు ఘన సన్మానం



కార్పొరేటర్ పద్మాలతారెడ్డిని సన్మానిస్తున్న ఉయ్యాలవాడ నరసింహరెడ్డి సేవా సమితి సభ్యులు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ 17 వ వార్డు కార్పొరేటర్ కైపా పద్మాలతా రెడ్డి రెండు రోజుల క్రితం నగరపాలక స్టాండింగ్ కమిటీ సభ్యురాలుగా ఎన్నికయ్యారు. అమె ఎన్నికను పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం ఉయ్యాల వాడ నరసింహారెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో అమెకు ఘనంగా సత్కరించారు. అలాగే గత నెల 31 వ తేదీ ఎల్‌ఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేసి పదవి విరమణ పొందిన ఎ. ప్రతాప్‌రెడ్డిని సేవా సమితి ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల ఆధినేత కేవీ సుబ్బారెడ్డి, జోగి వెంకటరామిరెడ్డి, విజయమోహన్ రెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, సహవాసుదేవరెడ్డి, హనుమంతరెడ్డి, గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.



కొండారెడ్డి బురుజు దగ్గర అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మేయర్ బీవై రామయ్య, మాజీ ఎంపీ బుట్టా రేణుక

స్మార్ట్ సిటీగా నగరం

కర్నూలు (టౌన్): గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేస్తూ కర్నూలు నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతున్నట్లు నగర మేయర్ బీవై రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ వెల్లడించారు. ఆదివారం స్థానిక పాతబస్టాండ్ కొండారెడ్డి బురుజు వద్ద రూ.1.90 కోట్లు విలువ చేసే అభివృద్ధి పనులను కార్పొరేటర్లతో కలిసి వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ మరో మూడు నెలల వ్యవధిలో కొండారెడ్డిబురుజు పనులు పూర్తి చేస్తామన్నారు. కొండారెడ్డి బురుజు వెనుక పాదాచారులు మాత్రమే రాకపోకలు సాగించాల్సి ఉంటుందన్నారు. వాహనాలన్నీ అంబేడ్కర్ సర్కిల్ వైపు నుంచి వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. చారిత్రాత్మక కట్టడమైన కొండారెడ్డి బురుజు వద్ద పార్కు, వాటర్ ఫౌంటెన్, చరిత్రకారుల విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్లలో నగరం రూపురేఖలు మార్చినట్లు చెప్పారు. ప్రస్తుతం నగరంలోని 52 వార్డుల్లో మురుగు కాల్వలు, సీసీ రోడ్లు, కల్వర్టుల నిర్మాణ పనులు పెద్ద ఎత్తున చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బుట్టారేణుక, పార్టీ నగర అధ్యక్షురాలు సత్యనారయణమ్మ, ముఖ్య నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం



లలితా పీఠంలో ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కట్టుకుంటున్న బాలికలు

కర్నూలు కల్చరల్: నగరంలో పలువురు ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. సెయింట్ జోసఫ్ పాఠశాల 1977 బ్యాచ్‌కు చెందిన డిప్యూటీ కలెక్టర్ సాధన ఎస్తేర్, వివిధ హోదాల్లో ఉన్న ఆమె స్నేహితులు జయ, అన్నె ప్రతాప్, ప్రమీల, జహనారా, ఫౌజియా, ఫ్లారెన్స్, యశోద, విమల, రాధ, కోమల తదితరులు కర్నూలు నగర వనంలో కలుసుకుని సరదాగా గడిపారు. చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. ఓల్డ్ సిటీ జమ్మిచెట్టు సమీపంలోని లలితా పీఠంలో రాఘవేంద్ర స్వామి సేవా సత్సంగం ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం నిర్వహించారు. చిన్నారులు వారి స్నేహితులకు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కట్టి సంతోషంగా గడిపారు.

గుండెజబ్బులపై అప్రమత్తత అవసరం



డాక్టర్ ఎ.వసంతకుమార్‌ను సన్మానిస్తున్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): గుండెజబ్బుల పట్ల అప్రమత్తత అవసరమని సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ ఎ.వసంతకుమార్ చెప్పారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక ఎ.క్యాంపులోని కర్నూలు హెల్త్‌క్లబ్‌లో గుండెజబ్బులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎ. వసంతకుమార్ మాట్లాడుతూ గుండెపోటు వచ్చిన నాలుగు గంటల్లో అన్ని వసతులు ఉన్న ఆసుపత్రికి వెళితే కోలుకునే అవకాశం ఉంటుందన్నారు. గుండెపోటు మరణాలను నివారించేందుకు ప్రస్తుతం ఆధునిక వసతులు, సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయని, కార్డియాలజిస్టుల సంఖ్య కూడా పెరిగిందన్నారు. గుండెజబ్బులకు చికిత్స చేసే వైద్యుల సంఖ్య పెరగడం, వైద్యంపై ఎప్పటికప్పుడు నాలెడ్జ్ అప్‌డేట్ కావడం రోగులకు వరంలా మారిందని చెప్పారు. గుండెజబ్బుల మరణాలను తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోతున్న స్టెమి ప్రోగ్రామ్ వల్ల ఇంకా మేలు జరుగుతుందన్నారు. దీనివల్ల గుండెపోటుతో చనిపోయే వారి సంఖ్య తగ్గుతుందని చెప్పారు. స్టెమి ప్రోగ్రామ్‌ను గ్రామీణ ప్రాంతాల్లోని సీహెచ్‌సీల్లోనూ ఏర్పాటు చేయడం ద్వారా చాలా వరకు మరణాలు తగ్గే అవకాశం ఉందన్నారు. ఆయా కేంద్రాల్లో ఖరీదైన ఇంజెక్షన్లు ఇచ్చి ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కర్నూలు పంపించడం వల్ల గుండెరోగులకు మరింత మేలు జరుగుతుందని తెలిపారు. ప్రజలు సైతం గుండెజబ్బులకు దూరంగా ఉండాలని, జీవనశైలిని మార్చుకోవాలని సూచించారు. ప్రతిరోజూ వ్యాయామం చేయాలని, సమతుల ఆహారం తీసుకోవాలని, ఆహారంలో నియంత్రణ పాటించాలని చెప్పారు. అనంతరం ఆయనను కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి. చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు డాక్టర్ భవానీప్రసాద్, ట్రెజరర్ వెంకటరాముడు సన్మానించారు.

ప్రజాగాయకుడు గద్దర్ మృతికి సంతాపం



కలెక్టరేట్ వద్ద కొవ్వొత్తులు ప్రదర్శిస్తున్న సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు

కర్నూలు (టౌన్) : ప్రజా కవి గద్దర్ మృతికి పలువురు నివాళ్లు అర్పించారు. ఆదివారం రాత్రి సీపీఐ ఆధ్వర్యంలో ప్రజా సంఘాల నాయకులు నగరంలో ర్యాలీ నిర్వహించారు. గద్దర్ చిత్రపటం, కొవ్వొత్తులతో ప్రజా సంఘాల నాయకులు ర్యాలీగా స్థానిక కలెక్టరేట్ గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ నేత రామక్రిష్ణారెడ్డి (సీపీఐ), ప్రజా సంఘాల నాయకు లు శేషఫణి, సుంకన్న, సయ్యద్, ఏఐటీయూసీ నాయకురాలు లలితమ్మ, నగర కార్యదర్శి చంద్రశేఖర్ మహేష్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పరితపించిన గొప్ప వ్యక్తి గద్దర్ అని అన్నారు. పాటల రూపంలో ప్రజలను చైతన్యవంతులను చేశారని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం గద్దర్ జ్ఞాపకార్థం స్మారక స్థూపాన్ని ఏర్పాటు చేయాలన్నారు.కాగా ప్రజాకవి గద్దర్ మృతికి మాజీ రాజ్య సభ సభ్యుడు టీజీ వెంకటేష్ ఆదివారం ప్రకటనలో సంతాపం ప్రకటించారు.

కర్నూలు కల్చరల్: గద్దర్ మృతి తీరని విషాదమని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. రాయలసీమ కర్తవ్య దీక్షలో పాల్గొని మద్దతు ప్రకటించారని గుర్తు చేసుకున్నారు. కర్నూలుకు వచ్చి రాయలసీమ ఉద్యమానికి ఊపిరులూదు దామన్న గద్దరన్న మృతి విషాదకరమని రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్ పేర్కొన్నారు. ఆర్‌వీపీఎస్ తరఫున గద్దర్‌కు కన్నీటి నివాళులర్పిస్తున్నామని తెలిపారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తిఓబులయ్య, హనుమాన్ కళా సమితి అధ్యక్షుడు హనుమంతరాయ చౌదరి గద్దర్ మృతికి సంతాపం ప్రకటించారు. ప్రజా వైద్యులు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి, జన విజ్ఞాన వేదిక నాయకులు సురేష్, మహ్మద్ మియ్యా, ప్రతాపరెడ్డి, దామోదర్ తదితరులు ప్రజా గాయకుడికి సంతాపం ప్రకటించారు.

కర్నూలు(రూరల్/న్యూసిటీ): ప్రజాకవి గద్దర్ మృతి కళా రంగానికి తీరని లోటని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో నిరుపేదల తరపున అనేక పోరాటాలు చేశారన్నారు. గద్దర్ మృతి బాధాకరమని జిల్లా టీడీపీ అధ్యక్షుడు బీటీ నాయుడు ఆదివారం ఓ ప్రకటనలో సంతాపం ప్రకటించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కర్నూలు సిటీ: కేసీ కెనాల్ వర్క్‌చార్జ్డ్ ఉద్యోగుల సంఘం కర్నూలు బ్రాంచ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగరంలో జరిగిన ఈ కార్యక్రమంలో కర్నూలు బ్రాంచ్ అధ్యక్షుడిగా డి.సత్యవతి, ప్రధాన కార్యదర్శిగా పి.వెంకటయ్య, ఉపాధ్యక్షురాలిగా సి.లక్ష్మీదేవి, జాయింట్ సెక్రటరీగా ఆంజనేయులు, ట్రెజరర్‌గా సి.నాగార్జునను సభ్యులు ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి ఎం.దేవదాసు తెలిపారు.

భూముల రీ సర్వేతో రైతులకు ప్రయోజనం

కర్నూలు (న్యూటౌన్): భూముల రీ సర్వేతో భూ వివాదాలు పూర్తిగా పరిష్కారమవుతాయని, దీంతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని కర్నూలు ఆర్డీఓ సి.హరిప్రసాద్ అన్నారు. ఆదివారం దిగువపాడు గ్రామంలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు – భూ రక్ష కార్యక్రమంపై గ్రామసభ నిర్వహించారు.